

రేపు ఉద్యోగ మేళా

విజయనగరం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న మంగళవారం డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు బయోడేటాతో ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. సాయంత్రం 4.30 గంటల వరకు మేళా కొనసాగుతుందని పీడీ తెలిపారు.

ఆ రోడ్డుపై అగచాట్లేనా?

- విజయనగరం-పాలకొండ రోడ్డు అభివృద్ధికి నో చాన్స్
- పీపీపీ విధానంలో నిర్మాణానికి వీలు లేదట
- చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్డుకు మాత్రమే అంగీకారం
- డీపీఆర్ తయారీలో స్పష్టం


విజయనగరం-పాలకొండ రోడ్డులో మజ్జిరామునిపేట వద్ద అడుగుకో గుంత

విజయనగరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కీలకమైన రహదారి అభివృద్ధి అంశం అయోమయంలో పడింది. ఇప్పట్లో మోక్షం కలిగే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా కేంద్రం విజయనగరం నుంచి మన్యం జిల్లా పాలకుండ వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేదు. ఒక్కో చోట అడుగుకో గుంత కనిపిస్తోంది. అయితే ఈ రోడ్డుతో పాటు ఉమ్మడి జిల్లాకు అనుసంధానంగా ఉన్న మరో రెండు రహదారులను అభివృద్ధి చేస్తే మూడు జిల్లాలకు (విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం) రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ మూడు ప్రధాన రహదారులపై దృష్టిపెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో నిర్మించాలని నిర్ణయించింది. రోడ్లు భవనాల శాఖ ఆ మేరకు ప్రతిపాదనలు కూడా పంపింది. కానీ డీపీఆర్ తయారీ తర్వాత రెండు రహదారులకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. కళింగపట్నం- శ్రీకాకుళం- పార్వతీపురం (సీఎస్పీ) రహదారి, పాలకొండ-విజయనగరం రహదారి సాధ్యం కాదని డీపీఆర్‌లో తేల్చేశారు. అనూహ్యంగా చిలకపాలెం- రామభద్రపురం-రాయగడ (సీఎస్ఆర్) సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ పరిణామంతో రెండు రహదారుల పరిస్థితి అగమ్యగోచరంలో పడింది.

పీపీపీ విధానంలో నిర్మించనున్న ఈ రోడ్లకు సంబంధించి కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని తెలిసింది. డీపీఆర్ రూపొందించడంలో వాటినే ప్రమాణికంగా తీసుకున్నారు. వాహన రాకపోకల స్థాయి, నిర్వహణ వ్యయం, టోల్‌టాక్స్‌ల వసూళ్లు వంటి అంశాలను అంచనా వేశారు. ఈవిధానంలో పరిశీలిస్తే విజయనగరం-పాలకొండ, పార్వతీపురం-కళింగపట్నం రోడ్లు నిర్మించడం సాధ్యం కాదని తేల్చేశారు. ఇందులో శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్డును 108 కిలోమీటర్ల మేర రెండు లేదా నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని భావించారు. ఇందుకుగాను రూ.567 కోట్లు అవసరమని గుర్తించారు. విజయనగరం-పాలకొండ రహదారిని 70 కిలోమీటర్ల మేర నాలుగు లేదా రెండు వరుసల్లో విస్తరించాలని చూశారు. ఇందుకుగాను రూ.642 కోట్లు అవసరమని గుర్తించారు. చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్డును 131 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. అయితే ఇది అంతర్ రాష్ట్ర రోడ్డు కావడంతో వాహనాల రాకపోకల దృష్ట్యా ఆదాయం ఉంటుందని అంచనా వేశారు. అందుకే ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1172కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినా.. అదే స్థాయిలో లాభం ఉంటుందని ఆర్థిక సాంకేతిక బృందం తేల్చింది. అందుకే ఈ రోడ్డు మినహాయించి మిగతా రెండు రోడ్లకు మాత్రం సాధ్యం కాదని తేల్చిచెప్పింది.

- జిల్లాలో ప్రధానంగా విజయనగరం-హడ్డుబంగి రహదారి ఉంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలను (మిగతా 8వ పేజీలో..)

ఆఖరి మజిలీలోనూ అవస్థలే

- పురిటిపెంట రైల్వే కాలనీకి శ్మశానవాటిక లేక ఇబ్బందులు
- స్థలం మంజూరు చేయాలని ఏళ్లుగా కోరుతున్న కాలనీవాసులు

7లో

తరగతి గదుల్లో సుగర్ బోర్డులు

- చక్కెర వ్యాధిపై విద్యార్థులకు అవగాహనే లక్ష్యం
- ప్రభుత్వ వినూత్న ఆలోచన



చక్కెర వ్యాధిపై అవగాహనకు ఏర్పాటు చేయనున్న బోర్డు

కొత్తవలస, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చక్కెర వ్యాధి(మధుమేహం)కేసులపై ప్రభుత్వం అప్రమత్తమైంది. విద్యార్థులకు చిన్నప్పుడే అవగాహన కలిగిస్తే రేపటి పౌరులు మరింత ఆరోగ్యంగా ఉంటారని భావించి వినూత్న ప్రయోగానికి సంకల్పించింది. తరగతి గదిలో చక్కెర బోర్డులను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నమూనా బోర్డులను కూడా పంపింది.

ప్రస్తుతం సుగర్ వ్యాధి బాధితులు దాదాపు ఇంటికొకరు చొప్పున ఉంటున్నారు. భవిష్యత్తులో ఈ వ్యాధి మరింత తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి చిన్న వయసు వారికి కూడా చక్కెర వ్యాధి వస్తోంది. గతంలో 40 సంవత్సరాల వయసు పైబడిన వారిలో మాత్రమే చక్కెర వ్యాధి లక్షణాలు కనిపించేవి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దీంతో ప్రభుత్వం చక్కెర వ్యాధి నియంత్రణే లక్ష్యంగా పెట్టుకుని విద్యార్థి దశ నుంచే సమగ్ర అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. ప్రత్యేకంగా బోర్డులు తయారు చేయించింది. వాటిని తరగతి (మిగతా 8వ పేజీలో..)

చలో వేపాడ

- ఒకప్పుడు వద్దన్నారు.. ఇప్పుడు కావాలంటున్నారు
- అప్పట్లో తప్పుచేసే అధికారులకు శిక్షగా ఈ మండలానికి బదిలీ
- నేడు డబ్బులిచ్చి మరీ పోస్టింగ్ కోసం పోటీ
- తరచూ ఏసీబీ వలకు చిక్కుతున్న రెవెన్యూ సిబ్బంది
- అయినా తగ్గని వసూళ్లు





ఒకప్పుడు వేపాడ మండలం పేరు చెబితే అధికారులు అమ్మో అనేవారు. ఈ మండలంలో విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. దీంతో ఉన్నతాధికారులు తప్పులు చేసే అధికారులకు శిక్షగా ఇక్కడకు బదిలీ చేసేవారు. అలాంటి పరిస్థితి నుంచి ఇప్పుడు అధికారులే డబ్బులు ఇచ్చిమరీ పోస్టింగ్ కోసం పోటీపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రాపకంతో కుర్చీని పదిలం చేసుకుంటున్నారు. వేపాడ మండలం ఆదాయ వనరుగా మారడమే ఈ మార్పునకు కారణంగా కనిపిస్తోంది.

శృంగవరపుకోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)

వేపాడ మండల పరిధిలోని ఓ సచివాలయ రెవెన్యూ అధికారి రూ.లక్షతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు ఇటీవల చిక్కడంతో ఈ మండలం మరోసారి జిల్లా వ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కింది. మొదట్లో ఈ మండలమంటే అనక్తి చూపని అధికారులు రానురాను ఇక్కడ పనిచేసేందుకు అత్యుత్సాహం చూపుతుండడం ఇందుకేనా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ మండల కేంద్రం జిల్లాకు మారుమూలన ఉంటుంది. రవాణా సదుపాయం తక్కువ. ఇటు విశాఖ-అరకు రోడ్డులోని సోంపురం కూడలి నుంచి పది కిలోమీటర్లు, అటు కొత్తవలస-దేవరాపల్లి రోడ్డులోని ఆనందపురం కూడలి నుంచి పదికిలోమీటర్ల దూరంలో వున్న ఈ మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులను తిప్పడం లేదు. ఈ మండలంలో పని చేసే ఉద్యోగులకు సొంత వాహనం వుంటే తప్ప సకాలంలో విధులకు హాజరయ్యేందుకు అవకాశం లేదు. ఇలాంటి భిన్నమైన పరిస్థితులున్న ఈ మండలం రెవెన్యూ అధికారులకు కాసులు కురిపిస్తోంది. దీంతో ఇక్కడ పోస్టింగ్ కోసం అర్రులు చాస్తున్నారు. ఇప్పటికే ఉన్న వారు కుర్చీని కాపాడుకుంటున్నారు.

- వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ మండలంలో అనేక భూ అవకతవకలు జరిగాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. చెరువు గట్లను లేఅవుట్‌లకు రహదారులుగా ప్రైవేటు భూములకు రహదారులుగా మార్చినా పట్టించుకోలేదు. కొండగంగూ బూడి పంచాయతీలో దాదాపు నాలుగు ఎకరాలకు పైబడిన ప్రభుత్వ భూమిని అమ్మకానికి పెట్టారు. లేఅవుట్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదు.
- వేపాడ మండల పరిధిలో 1433.79 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఇవన్నీ 22ఏ నిషేధిత జాబితాలో వున్నప్పటికీ చేతులు మారాయి. ప్రధానంగా కొండగంగుబూడి, అంకాజోస్యుల పాలెం, చామలాదేవి అగ్రహారం, దబ్బిరాజుపేట, వీలుపర్తి తదితర గ్రామాల పరిధిలో అత్యధికంగా ఈ భూములు వేరొకరి చేతిలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములకు చట్టబద్ధత (ఫ్రీహోల్డ్) కల్పించింది. ఇదే అప్పటి రెవెన్యూ అధికారులకు కలిసొచ్చింది. ఒక్క కేజీ పూడి గ్రామ పరిధిలో 98.32 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరిగింది. కూటమి ప్రభుత్వం చేయించిన విచారణలో ఈ విషయం బయటపడడంతో ఓ సబ్ రిజిస్ట్రార్‌పై సీసీఎల్ఏ చర్యలు తీసుకుంది. వేపాడ మండలంలో 200.09 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల పరిస్థితి కూడా ఇంతే.

ఏసీబీ వలలో ఎందరో..

వేపాడలో రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ వలలో పడడం ఇదే మొదటిసారి అనుకుంటే పొరపాటే. గతంలో అవనీతి నిరోధక శాఖ తహసీల్దార్, ఉప తహసీల్దార్, సర్వేయర్‌లపై వల పన్నింది. అనుకోకుండా (మిగతా 8వ పేజీలో..)

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

- అప్పుల బాధలు తాళలేకే


రాఘవ (ఫైల్)

రామభద్రపురం/గరుగుబిల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): దుప్పలపూడి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి శీర రాఘవ (26) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధలు తాళలేకే ఈ నిర్ణయం తీసుకున్నాడు. స్థానికులు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చిన్న గొడబ గ్రామ సచివలయంలో శీర రాఘవ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈయన తండ్రి పాస్టర్. తల్లి అన్నపూర్ణ గృహిణి. తమ్ముడు రవి మండల రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. రాఘవ రైతు సేవా కేంద్రంలో ఎరువుల విక్రయాలకు సంబంధించి రైతుల నుంచి వసూలైన సుమారు 5 లక్షల రూపాయలు మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సి ఉంది. కానీ చెల్లించలేదు. దీంతో కొద్దిరోజులుగా టెన్షన్ పడుతున్నాడు. మరోవైపు అప్పు ఇచ్చిన వారి నుంచి కూడా ఒత్తిడి ఉంది. ఈ బాధలకు తాళలేక శనివారం మధ్యాహ్నం దుప్పలపూడి గ్రామంలోనే తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాడంగి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం నాటికి పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి శీర ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటిపాంలో గజరాజులు

కొమరాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం కోటిపాం గ్రామ సమీపంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. అవి ఏ క్షణాన గ్రామంలోకి వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. మరోవైపు గజరాజులు చెరకు, పత్తి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. కొద్ది రోజులుగా ఇదే మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును తక్షణమే ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీశాఖ సిబ్బంది ఏనుగులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.


పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

డీఎస్సీలో అభ్యర్థుల ప్రతిభ

- ఐదు కొలువులు సాధించిన శ్రీరామ్.. మూడు కొలువుల్లో అనిత


శ్రీరామ్

విజయనగరం రింగురోడ్డు/వేపాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో విజయనగరానికి చెందిన కేవీఎస్ శ్రీరామ్ ఐదు ఉద్యోగాలు సాధించారు. ఎస్ఏ గణితంలో 7వ ర్యాంకు, ఫిజిక్స్‌లో 10వ ర్యాంకు, జోన్‌స్థాయి పోస్టులో పీజీటీ మ్యాథ్స్‌లో 5వ ర్యాంకు, టీజీటీ మ్యాథ్స్‌లో 18వ ర్యాంకు, జనరల్ సైన్స్‌లో 7వ ర్యాంకు సాధించి అందరినీ అబ్బుర పరిచాడు. శ్రీరాం కొద్ది నెలల కిందట తెలంగాణ డీఎస్సీ పోటీ పరీక్షలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ సబ్జెక్టులో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

- వేపాడ మండలం సింగరాయి గ్రామానికి చెందిన బోకం అనిత డీఎస్సీలో మూడు ఉద్యోగాలు సాధించారు. సోషల్ అసిస్టెంట్ బయోలజీలో 89.7 మార్కులతో స్టేట్ ఫస్టు రాగా టీజీటీ బయాలజీలో 84.9 మార్కులతో స్టేట్ ఫస్టు సాధించారు. అలాగే టీజీటీ సైన్సులో 79.9 మార్కులతో స్టేట్ ర్యాంకులో నిలిచారు. ఒకే అభ్యర్థిని మూడు స్టేట్ ర్యాంకులు సాధించడంతో ఆమెను అందరూ అభినందిస్తున్నారు. అనిత ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 8.4/10 మార్కులు, బీఈడీ 8.08/10 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.


అనిత

వినాయక ఉత్సవాల్లో అనుచితంగా ప్రవర్తించొద్దు: ఎస్పీ

విజయనగరం క్రైమ్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి జరగనున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎవరూ అనుచితంగా ప్రవర్తించవద్దని, రికార్డింగ్ డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పందిళ్లు, మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు గురి చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాల న్నారు. ఊరేగింపుల్లో డీజేల నిర్వహణ, బాణసంచా విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు 24/7 అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల అనుమతులు కూడా పొందాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించినట్లయితే అనుమతులు పొందాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


7లో

తాళ్లడుమ్మలో అగ్ని ప్రమాదం

- రూ.10 లక్షల నష్టం

7లో

ఒక్క యూనిట్టూ మంజూరు కాలె!



- ప్రహసనంగా బీసీ కార్పొరేషన్ రుణాలు
- ఆర్నెళ్లయినా అందని లోన్లు
- నిరాశలో లబ్ధిదారులు



మెంటాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా యువతకు అందించాల్సిన స్వయం ఉపాధి రుణాలపై అందరిలో అనుమానాలు నెలకొన్నాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ఒక్కరంటే ఒక్కరికి కూడా యూనిట్ మంజూరుకాకపోవడంపై అభ్యర్థుల్లో అసంతృప్తి నెలకొంది. నెలలోపే మొత్తం యూనిట్లు గ్రౌండ్ చేసేస్తామన్న అధికారులు ఇప్పుడు ముఖం చాటేయడం సరికాదంటున్నారు. ఐదునెలలుగా వారంతా ఎంపీడీవో, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా కదలిక లేదు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యువతకు స్వయం ఉపాధి రుణాల మంజూరుకు బీసీ సంక్షేమ శాఖ మార్చిలో దరఖాస్తులు ఆహ్వానిస్తూ షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా 19,616 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేనెలలో వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించిన బ్యాంకులు అర్హులైన అభ్యర్థులకు సమ్మతిని ఇచ్చాయి. అన్నింటినీ క్రోడీకరించి మున్సిపల్ కమిషనర్లు,ఎంపీడీవోలు బీసీ కార్పొరేషన్‌కు (మిగతా 8వ పేజీలో..)

ఆఖరి మజిలీలోనూ అవస్థలే

- పురిటిపెంట రైల్వే కాలనీకి శ్మశానవాటిక లేని వైనం
- స్థలం మంజూరు చేయాలని కోరుతున్న కాలనీవాసులు

గజపతినగరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపెంట రైల్వే కాలనీకి శ్మశానవాటిక లేకపోవడంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 40 ఏళ్లగా వీరు రైలు పట్టాలకు ఆనుకుని ఉన్న రైల్వే స్థలంలో దహన సంస్కరణలు చేపట్టేవారు. మూడో రైల్వే లైన్ పనుల్లో భాగంగా స్థానిక రైల్వే కేబిన్ సమీపంలో ఉన్న కల్వర్టును మూసివేశారు. దీంతో ఎగువన ఉన్న రాళ్ల చెరువు నీరు ఈ శ్మశానవాటికలోకి వచ్చి చేరుతోంది. అలాగే ఆ స్థలంలో రైల్వే పనులకుగాను రాళ్లు, మట్టి నిల్వ చేస్తున్నారు. దీంతో ఆ స్థలం కూడా కనుమరుగవుతోంది. ఉన్న కొద్దిపాటి స్థలంలో శ్మశానవాటికకు మృతదేహన్ని తీసుకు వెళ్లేందుకు కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో నడుము లోతు నీటిలో మృతదేహన్ని మోసుకెళ్లి దహనం చేయాల్సి వస్తోంది. ఇప్పటికే కాలనీలో జగనన్న కాలనీ రావడంతో 350 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గతంలో 250 కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం శ్మశానవాటిక పరిస్థితి బాగులేక పోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని అవస్థలు తప్పవని కాలనీవాసులు వాపోతున్నారు.

- శ్మశానవాటికకు స్థలం సమకూర్చాలని కోరుతూ పురిటిపెంట రైల్వే కాలనీవాసులు.. పంచాయతీ పాలకులు, అధికారుల చుట్టూ తిరుగున్నారు. మంత్రిగా మొదటిసారి గ్రామానికి వచ్చిన కొండపల్లి శ్రీనివాస్‌కు సమస్యను పరిష్కరించాలని విన్నవించామని, ఆయన స్పందించి పంచాయతీ పాలకులు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు స్థల సేకరణ చేపట్టక పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


నీటిలో దిగి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న దృశ్యం (ఫైల్)

శ్మశానవాటికకు దారి లేక..

- తోటల్లో నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్లిన వైనం


తోట మధ్యలోంచి మృతదేహాన్ని తీసుకువెళుతున్న దృశ్యం

లక్కవరపుకోట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు సరైన దారిలేక తుప్పలు, డొంకలు, సరుగుడు తోటల మధ్యలో నుంచి అంతిమయాత్ర నిర్వహించిన ఘటన ఆదివారం కల్లేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గాడి లక్ష్మి తీవ్రమైన అనారోగ్యంతో శనివారం సాయంత్రం తనువు చాలించింది. ఆదివారం ఆమె అంతిమ సంస్కారాలు చేపట్టారు. గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో దళితుల శ్మశానవాటిక ఉంది. దానికి నేటివరకు సరైన దారి లేదు. దీంతో దళితులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే చెరువులు నిండిపోవడంతో శవాన్ని పూడ్చడానికి కూడా జాగా కరువై ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని దళిత యువజనసేన తెలిపింది.

రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలి

కొత్తవలస, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొత్తవలస రైల్వేస్టేషన్‌లో హాల్టులు రద్దయిన రైళ్లకు సంబంధించిన హాల్ట్‌లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నాయకుడు గొరపల్లి రవికుమార్ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. గతంలో కొత్తవలస రైల్వేస్టేషన్‌లో చాలా రైళ్లను నిలుపుదల చేసేవారని, తర్వాత వాటిని రద్దు చేయడంతో ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నట్టు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే వాల్తేరు డివిజనల్ మేనేజర్‌ను కలిసి సమస్యలు వివరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రిని కలిసిన మార్క్‌ఫెడ్ చైర్మన్


ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని శనివారం రాత్రి అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసినట్టు రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూములిచ్చిన రైతులకు రావల్సిన పరిహార బకాయిలు, నిర్వాసితులకు మౌలిక వసతులు, పార్టీ పరిస్థితిపై వివరించానని చెప్పారు. అయితే అన్ని సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పార్లమెంటు పరిశీలకుడిగా బంగార్రాజు

భోగాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పార్లమెంటు పరిశీలకుడిగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈసందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతం కృషి చేస్తానని అన్నారు.

ఆధ్యాత్మిక విలువలు పెంపొందింపజేయాలి

రాజాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో ఆధ్యాత్మిక విలువలు పెంపొందింపజేయాలని రాజాం వికాస తరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, విజయ కోదండరామ ఆశ్రమం అధ్యక్షుడు టీటీవీ రామణమూర్తి అన్నారు. పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆదివారం వికాస తరంగిణి రాజాం శాఖ ఆధ్వర్యంలో భగవత దశమ స్కంధం కథా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. మానవతా సంస్థ అధ్యక్షుడు బి.అచ్యుత్‌కుమార్, వికాస తరంగిణి కోశాధికారి ఇప్పిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాత్విక ఆహారంతో ఆరోగ్యం

రాజాం, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి): సాత్విక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్‌కుమార్, డాక్టర్ బి.కృష్ణారావు, డాక్టర్ కరణం హరిబాబు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ ఫైర్ స్టేషన్ వద్ద ఆదివారం యోగా వికాస్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో సాత్విక ఆహారం స్టాల్‌ను ప్రారంభించారు. రాగిమాల్ట్, ప్రోటీన్ మాల్ట్, సలాడ్స్, యాష్‌గార్డ్, బాటిల్ గార్డ్ జ్యూస్ తదితర ఆహార పదార్థాలను ప్రదర్శించి, పలువురికి అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పి.చైతన్య కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

సూర్య సదనంలో పూజలు


సూర్యసదన్‌లో పూజలు చేస్తున్న పురోహితులు

గరివిడి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని సూర్యసదనంలో వేద పండితుడు వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానంద భారతీస్వామి, అరసవిల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, ధర్మకర్త ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

36 టన్నుల యూరియా సిద్ధం

మెంటాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలానికి మరో 36 టన్నుల యూరియా వచ్చిందని ఏవో గోకులకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ యూరియాను మండలంలోని రైతు సేవా కేంద్రాలకు చేర్చామన్నారు. తొలి విడతలో 68 టన్నుల యూరియా రాగా, తాజాగా, 36 టన్నులు వచ్చాయని చెప్పారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్

వేపాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదుంగాడ, పెదదుంగాడ, కడకొండ, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం తదితర గ్రామాల్లో వల్లంపూడి ఎస్‌ఐ సుదర్శన్ తన సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అక్కడ ఎటువంటి నాటు తుపాకీలు లభించలేదు. తుపాకీలను వినియోగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్‌ఐలు నాగేశ్వరరావు, వెంకటేశ్, హెచ్‌సీ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

'సేనతో సేనాని'ని విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ ఈనెల 30వ తేదీన విశాఖ వేదికగా సేనతో సేనాని పేరిట జనసేన పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర జన సైనికులు, వీర మహిళలు హాజరు కావాలని పార్టీ నాయకుడు, రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు సురేంద్రదేవా కోరారు. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం మున్సిపల్ స్టేడియం చేరుకుని, ఏర్పాట్లను సమీక్షించారని చెప్పారు. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం

జామి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు సీహెచ్‌డీటీ మూర్తి తెలిపారు. మండలానికి సంబంధించి 17,556, సిద్ధం అయ్యాయన్నారు. వీటిని గ్రామాల్లో ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు సచివాలయం ఉద్యోగులు, సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ డీలర్లు అందిస్తారన్నారు. ఇంకా ఎవరైనా తీసుకోని వారు ఉంటే ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు అందిస్తారని తెలిపారు. రెండో విడతలో భాగంగా జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబరు 1న కొత్తకార్డులు అందిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని రాజాం రోటరీక్లబ్ టౌన్ అధ్యక్షుడు గట్టి పాపారావు, కార్యదర్శి వసంతరావు అన్నారు. రోటరీ క్లబ్ నెలవారీ సమావేశాల్లో భాగంగా ఆదివారం స్థానిక కల్కి ఇన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలో నిర్వహించాల్సిన సామాజిక కార్యక్రమాలపై చైతన్యం కలిగించారు. ఈ సమావేశంలో సీనియర్ రొటేరియన్ మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.మధుసుదనరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విజయనగరం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో పార్టీ 28వ డివిజన్ ఇన్‌చార్జి సారిక శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మందికి విగ్రహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కెల్ల జానకి దేవి, 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఏలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ రూపంలో కృష్ణుడి విగ్రహం పెట్టడం తగదు

విజయనగరం రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తక్కెలపాడు గ్రామంలో స్థానికులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని సినీనటుడు ఎన్టీఆర్ రూపంలో పెట్టడం తగదని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు గదుల సత్యలత యాదవ్ అన్నారు. ఆదివారం దాసన్నపేటలోని కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ గొప్ప రాజకీయవేత్త, సినీ నటుడని ఆయన్ని ఆరాదిస్తాం.. గౌరవిస్తామన్నారు. కానీ ఇలా కృష్ణుని రూపంలో విగ్రాహాలు పెడతామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు తిరుపతిరావు, అప్పారావు, గౌరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే


విద్యార్థికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న కన్నంరెడ్డి యశ్వంత్‌ను ఎమ్మెల్యే లలితకుమారి దత్తత తీసుకున్నారు. పీ-4లో భాగంగా ఆర్థికభారంతో ఇబ్బంది పడుతూ చదివించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారని తెలిసి యశ్వంత్‌ను దత్తత తీసుకున్నానని ఆమె తెలిపారు. ఇకపై విద్యార్థి చదువు బాధ్యత తనదేనని పేర్కొన్నారు. మొదటి విడత ఫీజుగా రూ.25వేలను అందజేశారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు కంటతడిపెట్టాడు. ఈ కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, కొటాన విజయ్‌కుమార్, అక్కిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘానికి కార్యవర్గం

విజయనగరం క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమాన్ని విజయనగరంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఏన్నిక అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.హరి నారాయణ, ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పార్వతీపురానికి చెందిన లీడింగ్ ఫైర్‌మన్ ఎ.రమేష్, ఉపాధ్యక్షుడిగా బొబ్బిలికి చెందిన ఫైర్‌మన్ డి.ప్రకాష్, కార్యదర్శిగా ఎస్.కోటకు చెందిన ఫైర్‌మన్ వి.కృష్ణమోహన్, సహాయ కార్యదర్శిగా సాలూరుకు చెందిన లీడింగ్ ఫైర్‌మన్ ఎస్కే జగదీష్, కోశాధికారిగా చీపురుపల్లికి చెందిన లీడింగ్ ఫైర్‌మన్ జి.ఆదినారాయణ, సలహాదారుడిగా గజపతినగరం ఫైర్‌మన్ ఎల్.ఉమామహేశ్వరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి బి.హరినారాయణ తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సామాజిక భద్రత పథకాలు వినియోగించుకోవాలి

- రిజర్వు బ్యాంకు సీజీఎం సుబ్బయ్య


మాట్లాడుతున్న సీజీఎం సుబ్బయ్య

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా అందిస్తున్న సామాజిక భద్రతా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని రిజర్వు బ్యాంకు సీజీఎం సుబ్బయ్య అన్నారు. శనివారం రాత్రి విజయనగరం రూరల్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండలన్నారు. యూనియన్ బ్యాంకు జీఎం షాలిని, రిజర్వు బ్యాంకు డీజీఎం కళ్యాణచక్రవర్తి, యూనియన్ బ్యాంకు ఆర్ఎం జితేంద్రశర్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, యూనియన్ బ్యాంకు డీజీఎంలు రాజా, శ్రీనివాస్‌తో పాటు, స్థానిక సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ మృణాళిని ఖాతాదారులు పాల్గొన్నారు.

జనసేనలో 30 కుటుంబాలు చేరిక


పార్టీలో చేరిన వారితో అవనాపు విక్రమ్

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ కాట వీధికి చెందిన 40 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఆదివారం స్థానిక నాయకుడు లోపింటి వెంకట ప్రసాద్ నేతృత్వంలో వీరంతా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జనసేన నాయకుడు అవనాపు విక్రమ్.. పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన సాలూరు నాయకుడు జరజాపు సూరిబాబు, విజయనగరం నియోజకవర్గం నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, ఎర్నాగుల చక్రవర్తి, మండల లోకేష్, విజయ్‌కుమార్, ఉమామహేశ్వరావు, లోకనాథ్, హరి, షేక్ మారేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

బొండపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకులు బాధ్యతగా పనిచేయాలని గజపతినగరం ఏఎంసీ అధ్యక్షుడు వీవీవీ గోపాలరాజు అన్నారు. ఆదివారం గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు పర్యవేక్షణలో గొట్లాం పీఏసీఎస్ అధ్యక్షులుగా శిగడం శ్రీనివాస్, నేతేటి యల్లంనాయుడు, తాళ్లపూడి పైడి బాబులతో కార్యదర్శి తాళ్లపూడి అచ్చింనాయుడు ప్రమాణస్వీకారం చేశారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు కోరాడ కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు రామపాక అచ్చంనాయుడు, వెలమ కార్పొరేషన్ డైరక్టర్ ఎ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

భోగాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ దుర్గాప్రసాద్‌రావు సూచించారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలకు మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు పొందాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానంతో లాగిన్ అయి అనుమతులు పొందాలని తెలిపారు.

అనుమతి తీసుకోండి

కొత్తవలస, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుని అనుమతి తీసుకోవాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ దరఖాస్తులకు ఎటువంటి రుసుం చెల్లించ నవసరం లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జంతర్ మంతర్ వద్ద నిరసన: ఎమ్మెల్సీ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులతో కలిసి ఈనెల 27వ తేదీ తర్వాత ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపడతామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఇప్పటికే ఇక్కడ నిర్వాసితుల పోరాటం దేశ రాజధాని వరకు వివరించా మని ఈ తరుణంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదులు ఇచ్చామని చెప్పారు. ఇదే తరుణంలో తాము ఫిర్యాదు విషయాలపై విచారణ నిర్వహించి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్‌తో పాటు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు కలెక్టర్‌కు ఆదేశించాయన్నారు. ఇదే సమయంలో ఢిల్లీలో ఉంటున్న జాతీయ వినియోగదారుల ఫోరం చైర్మన్ పాండే రైతులను దేశ రాజధానికి ఆహ్వా నించారని, అక్కడ నిరసన చేసేందుకు అనుమతులు తీసుకుంటున్నా మని చెప్పారన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన


చేతులకు రిబ్బన్లు కట్టుకుని నిరసన చేస్తున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు గత 64 రోజులుగా నిరసన చేస్తున్నారు. ఆదివారం ఈ నిరసనలో భాగంగా చేతులకు సంకెళ్లు వేసుకుని ఆందోళన చేపట్టారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడారు. జిందాల్‌కు అనుకూలంగా మాట్లాడుతున్న నాయకులు, అధికారులు.. నిర్వాసితులకు మద్దతుగా మాట్లాడకపోవడం బాధాకరం అన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

గజపతినగరం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడిశీల గ్రామంలో వివాహిత ఆత్మహత్యకు గురైన కేసులో యడ్ల ఈశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. పిడిశీల గ్రామానికి చెందిన కర్రోతు సాయిసుధతో అదే గ్రామానికి చెందిన యడ్ల ఈశ్వరరావు గత 11ఏళ్లుగా పరిచయం ఏర్పర్చుకున్నాడు. అనుమానంతో ఆమెను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసేవాడు. దీంతో ఆమె మనస్థాపం చెంది ఇంట్లో తన భర్త, పిల్లలు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి పల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు గ్రామంలోని పెద్దలతో పాటు బంధువుల నుంచి వివరాలు సేకరించారు. సాక్ష్యాదారాల మేరకు పోలీసులు ఈశ్వరరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

హత్య కేసులో మహిళకు రిమాండ్

జామి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జట్టేడివలస గ్రామంలో ఈనెల 20న సంచలనం సృష్టించిన నేరపూరితమైన హత్య కేసులో నిందితురాలిగా భావిస్తున్న గూనురు లక్ష్మిని రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌ఐ వీర జనార్దన్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కుటుంబ వివాదంలో తన అత్త అయిన కొండమ్మను కిందకు తోసిన లక్ష్మిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. ఈమేరకు న్యాయాధికారి నిందితురాలికి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

తాళ్లడుమ్మలో అగ్నిప్రమాదం

- సుమారు రూ.10 లక్షలు నష్టం

జియ్యమ్మవలస, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లడుమ్మ పంచాయతీ కేంద్రంలో ఆదివారం ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు లక్షల నగదు, ఆస్తిపత్రాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.పది లక్షల వరకూ నష్టం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పళ్లెం శ్రీరామ్మూర్తికి చెందిన పెంకుటింట్లో ఫ్రిడ్జ్ వద్ద తొలుత మంట ప్రారంభమై ఇల్లంతా వ్యాపించింది. ఈ విషయాన్ని స్థానికంగా ఉంటున్న హోంగార్డు పాలపర్తి సూర్యనారాయణ (సురేష్) విషయాన్ని గుమ్మలక్ష్మీపురం ఫైర్ స్టేషన్‌కు, చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్‌కు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది, ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఇటీవల పొలం అమ్మిన రూ.4 లక్షలు, పదెకరాల పొలం దస్తావేజులు, పాస్ బుక్‌లు, టైటిల్‌డీడ్లు, ఎల్‌ఐసీ బాండ్లు, ఇతర విలువైన పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు తెలిపాడు. షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వివరాలు సేకరిస్తున్నామని, బాధితుల ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

మోటార్ల దొంగల అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మరువాడ గ్రామంలోని రైతుల కల్లాల్లో గల బోరుబావి మోటార్లు మాయంచేసే మోసగాళ్లను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపాలెం గ్రామంలో రెండు గొర్రెలు, రెండు కోళ్ల దొంగతనానికి గురయ్యాయని షేక్ కాశీమ్, అలాగే మరువాడకు చెందిన చెందిన వెన్నెల రమేష్ తన పొలంలో బోరుబావి మోటార్ సామగ్రి, మరో దఫా మోటార్ ఇంజన్ దొంగతనానికి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన బండారు శివ, కొండపేటకు చెందిన పైడిరాజులను పట్టుకుని అరెస్టు చేశారు.

గొర్రె పందాలపై దాడి

బొబ్బిలి/రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపెంట గ్రామ శివారులో గొర్రె పందాల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పాతపెంటలో గొర్రెపందాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంలో సీఐ కటకం సతీష్‌కుమార్, ఎస్‌ఐలు రమేష్, జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి శిబిరంపై దాడిచేసి పదిమంది పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు గొర్రెపోతులను, రూ.2,120ల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పేకాట శిబిరాలపై..

తెర్లాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు ఆదివారం దాడిచేశారు.ఈ మేరకు ఏడుగురి పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.30,100 స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సాగర్‌బాబు తెలిపారు. ● బొండపల్లి: మండలంలో ముగ్గురు జూదరులను శనివారం రాత్రి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు. గెద్దపేట గ్రామం శివారులో జూదం ఆడుతున్న వారిపై దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,820 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పూసపాటిరేగ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక గ్రోమోర్ సెంటర్, పేరాపురంలో గల వేంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎ.కామేశ్వరరావు, ఏవో నీలిమ పాల్గొన్నారు.

● డెంకాడ: డెంకాడ గ్రామంలో గల సాయికృష్ణ రైతు మిత్ర గ్రూప్ ఎరువుల షాపును విజిలెన్స్ హెచ్‌సీ కామేశ్వరరావు, డెంకాడ ఏవో సంగీత, పూసపాటిరేగ ఏవో నీలిమలు ఆదివారం తనిఖీ చేశారు. షాపులో గల ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను, డీబీటీ పరికరాలను పరిశీలించారు.

● గంట్యాడ: మండలంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బి.ప్రసాదరావు పర్యవేక్షణలో ఆదివారం తనిఖీ చేశారు. లక్కిడాం జంక్షన్‌లోగల శ్రీవెంకటరమణ జనరల్ స్టోర్స్, శ్రీబాలాజీ స్టోర్స్, గ్రోమోర్ సెంటర్‌లను తనిఖీ చేశారు. వ్యవసాయ అధికారులు, పోలీసు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని స్థానిక ఫోర్ట్ సిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎం.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా బి.సాయిచక్రధర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.శ్రీనివాస్, ఎ.కృష్ణారావు, వి.నారాయణరావు, హెడ్‌క్వార్టర్ ప్రధాన కార్యదర్శిగా ఎం.నగేష్‌కుమార్, డివిజనల్ అధ్యక్షులుగా ఎస్.త్రినాథరావు, జేవీజీకే మూర్తి, డి.మధుసూధనరావు, డివిజనల్ కార్యదర్శులుగా ఎ.గోవిందరాజు, బి.రవి శంకర్, డి.సత్యనారాయణ, మహిళా ప్రతినిధిగా డి.గౌరీదేవి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి ఎన్నికల పరిశీలకుడిగా బి.కృష్ణకుమార్ వ్యవహరించారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు

గజపతినగరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఎం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఆదివారం గజపతినగరం దిగువ వీధిలోగల ఎస్సీ బాలికల వసతిగృహంతో పాటు లోగిస గ్రామంలో సమీకృత బాలుర వసతి గృహంలో ఆమె విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వసతి గృహాల ప్రత్యేక అధికారులు గౌరి, అప్పలనాయుడు కె.రామాంజనేయులు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, ఇతర రద్దీ ప్రదేశాలలో శిశువులకు తల్లిపాలు అందించేందుకు ప్రత్యేక గదులు (ఫీడింగ్ రూమ్స్) అవసరమని గుర్తించి వాటిని ఏర్పాటుచేస్తున్నట్లు మార్వాడీ యువమంచ్ మహిళా విభాగం విశాఖ చైర్‌పర్సన్ జైశ్రీ హీరావత్ తెలిపారు. విజయనగరం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఐనాక్స్ భవన సముదాయంలో ఆదివారం ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. దీని ఏర్పాటుకు సహకరించిన నారాయణం శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్వాడీ మంచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

గుర్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. ఆదివారం జమ్మూపేట సహకార సొసైటీ అధ్యక్షుడిగా సీహెచ్ మహేశ్వరరావు ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, గూడెం సొసైటీ అధ్యక్షురాలు కె.విమలరాణి తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం మండల విద్యాశాఖ కార్యాలయం

శ్లాబు పెచ్చులూడి.. గోడలు బీటలు వారి

● శిథిలావస్థకు చేరిన ఎంఈవో కార్యాలయం

రామభద్రపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం ఎంఈవో కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. 1986లో నిర్మించిన ఈ కార్యాలయ భవనం పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో శ్లాబు పెచ్చు లూడిపడుతోంది. గోడలు కూడా బీటలువారాయి.ప్రతిరోజూ పెచ్చులూడికింద పడుతుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ పది మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వర్షాకాలం కావడంతో పైకప్పుపై నీరు నిల్వ ఉండడంతో గోడల నుంచి కిందకి కారుతోంది.తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కొత్తభవనం మంజూరుచేయాలని పలువురు కోరుతున్నారు.

నిర్వహణ లేక.. నిరుపయోగంగా మారి

● ఇదీ అలజంగి పంచాయతీలో చెత్త సేకరణ వాహనం పరిస్థితి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి పంచాయతీలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణకు గతంలో కేటాయించిన వాహనం నిరుపయోగంగా మారింది. గ్రామంలో మూడువేలమంది నివస్తున్నారు. పది వీధుల్లో పెరుగుతున్న జనాభావల్ల చెత్తసమస్య కూడా వేధిస్తోంది. దీంతో చెత్త నిర్వహణకు వాహనాన్నిస్వచ్ఛభారత్ పథకంలో భాగంగా సమకూర్చారు. తర్వాత సమర్థవంతంగా నిర్వహించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో పదివీధుల్లో సేకరిస్తున్న చెత్తను వేగావది నది ఒడ్డున డంప్‌చేస్తున్నారు. నదిలో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందన్న ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ప్రతిరోజూ చెత్తను సేకరించడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు.ఆ వాహనం కొద్దినెలలుగా వర్షంలో తడుస్తూ ఎండలో ఎండుతూ తుప్పు పట్టిపాడవుతోంది.దీంతో చెత్త తరలించేందుకు సిబ్బంది ఇబ్బందులుపడుతున్నా అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా మూలకుచేరిన వాహనాన్ని పరిశీలించి, మరమ్మతులు చేస్తామని డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనం



అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్న దృశ్యం

పర్యవేక్షణ లేక.. పక్కా భవనానికి నోచుకోక

● ఇదీ ఎర్రసామంతవలస అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి

మక్కువ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రసామంతవలసలో పక్కా భవనం లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. కేంద్రం నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కనీస సౌకర్యాలకు సైతం నోచుకోవడంలేదు.ఇక్కడ సుదర్ఘకాలంగాబాలవాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు.1984లో ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రంగా అప్ గ్రేడ్‌చేసింది.అప్పటి నుంచి కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. 102 మంది పిల్లలు, 15మంది గర్భిణులు, బాలింతలు ఈ కేంద్రం ద్వారా సేవలు పొందుతున్నారు. రెండేళ్ల కిందట సామాజిక భవనంలో విధులు నిర్వహించగా ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో మళ్లీ కేంద్రాన్ని అద్దె ఇంట్లోకి మా ర్చారు. కాగా ఎర్రసామంతవలసలోపాటు దుగ్గేరు, ఘైశిలలో కొత్తభవనంకోసం ప్రతిపాదనలు పంపామని పాచిపెంట ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి తెలిపారు. నిబంధనల ప్రకారమే అద్దెభవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు అద్దెచెల్లిస్తున్నామని తెలిపారు.

పలకలు వేసి.. కాలువలు ఆక్రమించి

● ఇదీ పార్వతీపురం మునిసిపాలిటీలోని 14వ వార్డులో పరిస్థితి

పార్వతీపురంటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపాలిటీలోని 14వ వార్డు గాంధీనగర్, గొల్లవీధుల్లో మురుగునీరు కాలువల్లో నిల్వఉండడంతో దుర్వాసన వెలువడుతోంది. దీనికితోడు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో వ్యాధులు ప్రబలడంతోపాటు చీకటిపడిన తర్వాత ఇబ్బందిపడుతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా గాంధీనగర్, గొల్లవీధుల్లో పలకలు వేసి కాలువలను కొందరు ఆక్రమించడంతో మురుగునీరు నిల్వఉంటోంది.కాలువల ఆక్రమణలకు సంబంధించి మునిసిపల్ ప్రజారోగ్యఅధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడంలేదని స్థానికంగా నివాసముంటున్న వారంతావాపోతున్నారు. తక్షణమే సిబ్బంది స్పందించి మురుగునీటి మళ్లింపునకు సంబంధించిన కాలువలపై ఆక్రమణలను తొలంచాలని పలువురు కోరుతున్నారు.



గాంధీనగర్‌లోని కాలువలో మురుగు నీరు నిల్వఉన్న దృశ్యం

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ దాడులు

పాచిపెంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలోని శ్రీకృష్ణా స్టోర్స్ ఎరువుల దుకాణంపై శ్రీకాకుళం విజిలెన్స్ ప్రాంతీయ రీజినల్ కార్యాలయ సీఐ ఆర్.రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. తొలుత ఎరువుల దుకాణానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి అనంతరం స్టాకును లెక్కించారు. రైతులకు అవసరమైన ఎరువులను నిబంధనల మేరకు విక్రయించాలని దుకాణ నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావుతో విజిలెన్స్ సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో దాడుల్లో ఎస్ఐ కె.వెంకటసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో వేపాడ

(ఐదో పేజీ తరువాయి)

తహసీల్దార్, సర్వేయర్‌లు తప్పుకున్నారు. ఉప తహసీల్దార్ మాత్రం దొరికిపోయారు. ఆ తరువాత ఓ గ్రామ రెవెన్యూ అధికారి రూ.20వేలతోను, మరో గ్రామ రేవెన్యూ అధికారి రూ.5వేలతోను, ఇంకో గ్రామ రెవెన్యూ అధికారి రూ.3 వేలతోనూ వేర్వేరు సందర్భాల్లో రైతుల నుంచి లంచంగా తీసుకుంటుం డగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ పట్టుకొంది. ఇలా తరచూ ఈ మండల రెవెన్యూ అవనీతి నిరోధక శాఖ వలలో పడుతోంది. అయినా జంకడం లేదు. భూముల్లో వున్న చిన్నచిన్న లోపాలను చూపించి దండుకుంటున్నారు.సెంటుకు రూ.800ల నుంచి రూ.1000 వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకుంటే వారి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారు. ఒకరిద్దరు తెగించి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. మిగిలిన వారంతా చేసేదేమీ లేక అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటున్నారు. ఇలా ఈ మండలం ఆదాయ వనరుగా మారడంతో ఇక్కడ పనిచేసేందుకు రెవెన్యూ అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ నుంచి కదలకుండా వుండేందుకు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నేతల దగ్గర చేరిపోతున్నారు.

ఆ రోడ్డుపై అగచాట్లేనా?

(ఐదో పేజీ తరువాయి)

కలుపుతూ ఉంటుంది. ఇటువంటి రహదారికి డీపీఆర్ ఆమోద ముద్ర వేయకపోడం విచారకరం. ముఖ్యంగా విజయనగరం నుంచి పాలకొండ వరకూ 64 కిలోమీటర్ల మేర రహదారిని బాగుచేస్తే రవాణా కష్టాలు తీరుతాయి. పర్యాటక, వాణిజ్య అవసరాలు మరింత మెరుగుపడతాయి. వైసీపీ సర్కారు ఎలాగు పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా మోక్షం లభించలేదు. ఈ రోడ్డు ధ్వంసం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి. ముఖ్యంగా రాజాం నుంచి పాలకొండ వరకూ ఉన్న రహదారి దారుణంగా తయారైంది. రాజాం పట్టణంలో అయితే రోడ్లు నరకం చూపిస్తున్నాయి. ఈ రహదారి విషయంలో జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపాం..

విజయనగరం-పాలకొండ రహదారిని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాం. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో రోడ్లనిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రభుత్వం నుంచి నిధుల ప్రకటనవస్తుందని ఆశతో ఉన్నాం.

-కాంతిమతి ఎస్ఈ, రోడ్లు భవనాల శాఖ, విజయనగరం

తరగతి గదుల్లో సుగర్ బోర్డులు

(ఐదో పేజీ తరువాయి)

గదిలో ప్రదర్శనకు ఏర్పాటు చేయనుంది. కాగా నేటి తరం ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడడం వల్ల వివిధ రకాల రోగాల బారినపడ్డమే కాకుండా చక్కెర వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంచదార(చక్కెర) వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియచేయాలని విద్యాశాఖ సూచించింది. చక్కెర వ్యాధి నియంత్రణ కోసం చక్కెర వినియోగంపై పరిమితులు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవన శైలి అలవర్చుకునే విధంగా విద్యార్థులను తయారుచేయాలని నిర్దేశించింది. చక్కెర బోర్డులను పాఠశాల తరగతి గదులతో పాటు పాఠశాల ప్రాంగణాల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రోజుకు పెద్దలు 25 గ్రాములకు మించిన చక్కెర ఉన్న పదార్థాలు తీసుకోకూడదని, పిల్లలు 20 గ్రాములు మించి చక్కెర ఉన్న పదార్థాలను తీసుకోకూడదని సూచించింది. తక్కువ చక్కెర తీసుకోండి.. జీవితాన్ని ఎక్కువ పెంచుకోండి నినాదాన్ని కూడా ఆంగ్లలో ప్రచురించింది. బోర్డుల నమూనాలను ఇప్పటికే పాఠశాలలకు పంపించారు.

ఒక్క యూనిట్టూ మంజూరు కాలె!

(ఐదో పేజీ తరువాయి)

పంపారు. ప్రభుత్వం సబ్సిడీ అమౌంట్ విడుదల చేసిన వెంటనే యూనిట్లు గ్రౌండ్ చేయడమే తరువాయి అన్నట్టుగా అట్నుంచి ప్రకటన వెలవడింది. ఏప్రిల్‌లో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమానికి హాజరవాలని, అక్కడే ప్రొసీడింగ్స్ అందజేస్తామని చెప్పడంతో అందరూ ఆశతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. జయంతి కార్యక్రమం ముగిశాక ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. నాటినుంచి ఇప్పటివరకు వారంతా యూనిట్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ బాధ్యత తాము పూర్తిచేసామని, ఏమైనా ఉంటే బ్యాంకర్లను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకులకు వెళ్తే సబ్సిడీ విడుదలైన వెంటనే యూనిట్లు గ్రౌండ్ అవుతాయని చెప్పుకొస్తున్నారు. కొందరు లబ్ధిదారులు తెగించి బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి అడిగితే పొంతనలేని సమాధానాలు రావడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. స్థానిక అధికారులకు కూడా ఇది తలనొప్పిగానే మారింది.రోజూ సమాధానం చెప్పుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

● జిల్లావ్యాప్తంగా 2383 మందికి 5347.98 లక్షలను రాయితీగా ఇవ్వనున్నట్టు ఆర్భాటంగా ప్రకటించిన బీసీ కార్పొరేషన్ అధికారులు ఆ తర్వాత ఇంత అలసత్వం చూపడంలో మతలబు ఏమిటనే ప్రశ్న లబ్ధిదారుల నుంచి వినిపిస్తోంది. 19,616 దరఖాస్తులు అందగా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని అప్పట్లో చెప్పుకొచ్చిన అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్న 2383 మందిలో ఒక్కరికి కూడా ఇప్పటివరకు యూనిట్ గ్రౌండ్ చేయకపోవడాన్ని తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి: ఎమ్మెల్యే



బొబ్బిలి: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. ఆదివారం బొబ్బిలికోటలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మట్టి వినాయకవిగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, చింతా శారద, సుంకరి సాయిరమేష్, సత్యంనాయుడు, మీసాల చినగౌరునాయుడు, బాల భాస్కరరావు, చప్ప అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు మార్గదర్శకాలు పాటించాలి

వినాయక ఉత్సవాల నిర్వహణకోసం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి కోరారు.బొబ్బిలిలోని పాతబస్టాండ్ ఆరి గంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వారణాశి శ్రీహరి ఆధ్వర్యంలో వెయ్యి మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సాయిరమేష్, శివకాంత్, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):రాజచెరువవలసలో సమరసతసేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణదాస్ పర్యవేక్షణలోమట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోన్నాబాబు, శ్రీనివాసు, మొయ్యి వెంకటరమణ, ఆచార్యులు రాయల పాపారావుపాల్గొన్నారు.

● రామభద్రపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడువలసలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన జేసీ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●పాలకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):ఎన్‌కేరాజపురం గ్రామ యువత కోదండ రామాలయం వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గరుగుబిల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలనిశ్రీరామా యువసేన ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం రావివలస ప్రాథమికఆరోగ్య కేంద్రం, అయ్యప్పస్వామి, శివాలయం, సంతోషి మాత ఆలయాల ఆవరణ, ప్రధాన రహదారికి ఇరువైపులా యువసేన ప్రతినిధులు మొక్కలు నాటారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భామిని, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలేరుకు చెందిన గువాడ వెంకటరమణ ఇటీవల మృతి చెందడంతో ఆయనతో చదువుకున్న స్నేహితులు ఆ కుటుంబాన్ని ఆర్థికసాయం చేశారు. 2000లో ఎల్ఎన్‌పేటలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులుచందాలు వేసుకొని వెంకటరమణ కుమార్తె పేరు మీద రూ.60 వేలు డిపాజిట్ చేశారు. ఆరు వేల రూపాయలు భార్య ఐబోకు అందజేశారు.

పోలీసుల అనుమతి తీసుకోవాలి

పాలకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి సూచించారు. ఆదివారం పట్టణంలోని పెదకాపువీధిలో సమావేశం నిర్వహించారు. నిబంధనలు మేరకు కమిటీ నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.

● వీరఘట్టం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):గణేష్ ఉత్సవాలను సక్రమంగా నిర్వహించాలని ఎస్ఐ కళాధర్ కోరారు. ఆదివారం చిదిమి, తూడి గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు చేపట్టాలి

కొమరాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):నాగావళి నదిలో పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు చేపట్టి పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి సాంబమూర్తి కోరారు. ఈమేరకు ఆదివారం అర్థాంతరంగా నిలిచిపోయిన వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో 20 కిలోమీటర్లు దూరంలో నాగావళి నదిపై మూడు వంతెనలు నిర్మించారని, మన రాష్ట్రంలో 19 ఏళ్లు గడుస్తున్నా ఒక్క వంతెన కూడా పూర్తిచేయలేకపోయారని ఆరోపించారు. వైసీపీ హయాంలో నిధులు మంజూరుచేసినట్లు చెప్పడమే గాని పనులు పూర్తికాలేదని తెలిపారు.కూటమి ప్రభుత్వం కూడా మాటలకే పరిమితమైందని ఆరోపించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

తెర్లాం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల మహిళలకు ఫ్రీబస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడడంతో వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు కోరారు. ఆదివారం తెర్లాం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో యునియన్ నాయకులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ఫ్రీబస్సు అమలు చేసేటప్పుడు ముందుగా నష్టపోయేది ఆటో నడిపే కార్మికులని వారిని ప్రభుత్వం గూర్తించక పోవడం దారుణమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-21 రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హమీని నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. బీఎన్ఎస్-106 (1)(2) రద్దుచేయాలని కోరారు. ఆటో కార్మికులను ఆదుకోక పోతే చలో విజయవాడ సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.గోపాలం పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సోదరభావంతో మెలగాలి

బొబ్బిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఆదివారం బొబ్బిలిలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ పూర్వ సంచాలిక రాజయోగిని దాది ప్రకాశమణి 18వ పుణ్య స్మృతిని విశ్వబంధుత్వ దినోత్సవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి,గోపాలకృష్ణ, ఇంతియాజ్, జెస్సీ జోషఫ్ పాల్గొన్నారు.

జేవీవీ మహాసభలను విజయవంతం చేయాలి

బొబ్బిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలో వచ్చే నెల 13, 14 తేదీల్లో జరగనున్న జనవిజ్ఞానవేదిక 18వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా ప్రతినిధి పోల సత్యంనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం బొబ్బిలిలో గ్రీన్‌బెల్ట్‌సొసైటీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహాసభల ప్రచారంలో భాగంగా మొక్కలు నాటారు.అనంతరం మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌రాష్ట్ర నేత కె.విజయగౌరి, గ్రీన్ బెల్ట్‌సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, వనమిత్ర కృష్ణదాసు,నాయకులు శశిభూషణరావు, కేశవరావు, మహేష్, లక్ష్మణ్, వెంకటనాయుడు, వరప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటం

● ఏపీ మునిపిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



సాలూరు: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఈయూ నాయకులు

సాలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):కార్మిక హక్కుల కోసం ఐక్యతంగా పోరాడుతామని ఏపీ మునిపిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం సాలూరులో ఏపీ మునిపిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభలు నిర్వహించారు. తొలుత రాజేశ్వరరావు పార్కు నుంచి డీలక్స్ సెంటర్ చిన్నబజారు, బోసుబొమ్మ మీదుగా డబ్బివీధి, వెంకటేశ్వర కళ్యాణమంపడం వరకు ర్యాలీ నిర్వహించారు. కామ్రేడ్ ఎన్.శంకరరావు, టి.శంకరరావు, సంజీవి అధ్యక్షతన జరిగిన మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామ్రేడ్ డి.రమణరావు, వై.మన్మథరావు, కోశాధికారి జి.సన్యాసిరావు, నాగవనం శంకరరావు పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద ధర్నా

పాలకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నా పాలకులు స్పందించడంలేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు.ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో రైతు సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్రం సరఫరా చేయలేదని విమర్శించారు. ఉన్న యూరియా కూడా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై ఈనెల 28న పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను రైతులు జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు నాయకులు బంటు దాసు, ఎ.సింహాద్రి, ప్రసాదరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీతంపేట రూరల్,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలు, మితిమీరిన వేగం, డ్రగ్స్ నియంత్రణ,గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుపై దోనుబాయి ఎస్ఐమస్తాన్ ఆధ్వర్యంలో అవగాహనకల్పించారు. ఆదివారం దోనుబాయి పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో వాహనచోదకులు, యువతకు పలు అంశాలపై వివరించారు.

నేడు పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలోని ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో సోమవారంపీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పీవోతో పాటు వివిధశాఖల అధికారులు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు.సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవొచ్చునని సూచించారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డివిజన్ పరిధిలో 132/33 కేవీ కలవరాయి ఫీడర్‌లో సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాంకేతిక కారణాల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బి.రఘు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోగల ప్రాంతాల్లో గ్రామాలకు ఇతర ప్రాంతాల నుంచి అవకాశమున్న ఏరియాలకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి స్మార్ట్‌కార్డుల పంపిణీకి చర్యలు

రామభద్రపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో 15వేల స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ అజు రఫీజాన్ తెలిపారు. సోమవారం నుంచి వచ్చేనెల 20 వరకు గ్రామ సచివాలయం సిబ్బంది రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు.

●బాడంగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం నుంచి ఈనెల 31 వరకు ఇంటింటికి పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. రేషన్ షాపు డీలర్ల వద్ద వచ్చేనెల ఒకటి నుంచి 15 వరకు, గ్రామసచివాలయ సిబ్బంది ద్వారా వచ్చేనెల 16 నుంచి 20 వరకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

13, 14 తేదీల్లో సీఐటీయూ మహా సభలు

సీతానగరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో సీఐటీయూమన్యం జిల్లా 11వ మహాసభలు సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా నాయకులు గవరవెంకటరమణ తెలిపారు. ఆదివారం సీతానగరంలో సీఐటీయూ జిల్లా మహాసభల గోడపత్రికలను సీపీఎం, కార్మిక సంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు ఆవిష్కరించారు.